క్లుప్తంగా

కుంతీ మాధవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్త బృందం

పద్మనాభం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం ఆరు గంటలకు భక్త బృందం సభ్యులు నగర సంకీర్తన నిర్వహించారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, గోదాదేవి విగ్రహాలను వేర్వేరు పల్లకీల్లో ఉంచి బేడా సేవ నిర్వహించారు.

లింగ ఆధారిత హింసను నిర్మూలించాలి



కోరాడలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పద్మనాభం: లింగ ఆధారిత హింసను నిర్మూలించాలని కోరుతూ కోరాడలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలను నిర్మూలించాలని, పిల్లల విద్యను ప్రోత్సహించాలని నినాదాలు చేశారు. సెర్ప్, వెలుగు, రైతు సాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీలో, నేషనల్ ఫార్మింగ్ అసోసియేట్ (ఎన్ఎఫ్ఏ) చక్రవర్తి, గణేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాల వితరణ

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెం ప్రాథమిక పాఠశాలలోని 31 మంది విద్యార్థులకు కంచాలు, పాఠశాలకు నాలుగు కుర్చీలను జనసేన నాయకులు మజ్జి సురేష్, రమేష్ వితరణగా ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనలక్ష్మి, సంతోషి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ స్వర్ణ భారతినగర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు మంజూరైనట్లు మాజీ సర్పంచ్ చెన్నాదాసు తెలిపారు. 10 ఏళ్లుగా భవన నిర్మాణం నిలిచిపోవడంతో రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, మోపిదేవి వెంకటరమణ దృష్టికి గతంలో తీసుకువెళ్లామని చెప్పారు. పూర్తిస్థాయిలో నిర్మాణం జరిగితే స్థానిక ప్రజలకు ఉపయోగపడుతుందని తెలియజేయడంతో ఇటీవల ఎంపీ నిధుల నుండి వారు రూ.50 లక్షలు విడుదల చేసినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

ఇళ్ల మధ్యే మురుగు



ఏనుగులపాలెంలో ఇళ్ల మధ్య మార్గంలో ప్రవహిస్తున్న మురుగునీరు

తగరపువలస: పద్మనాభం మండలం పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెం గ్రామంలో అపారిశుధ్యం కారణంగా స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారు. ఈ గ్రామంలో డ్రైనేజీలు లేని కారణంగా మురుగునీరు ఇళ్ల మధ్య నుంచి రాకపోకలు సాగించే మార్గంలో ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు మురుగులో నుంచే నడిచి వెళ్లవలసి వస్తోంది. ఇక్కడ ఉన్న సీసీరోడ్డు శిథిలమై ఆనవాళ్లు కూడా కోల్పోయింది. ఆనందపురం-బోని బీటీ రోడ్డుకు ఇరువైపులా ఇదేవిధంగా మురుగు సమస్య వేధిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి మురుగు నివాసాల మధ్య నిలిచిపోవడంతో తాగునీరు కలుషితమై, గ్రామస్తులు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. దీర్ఘకాలంగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్య నుంచి తమను విముక్తి చేయాలని ఏనుగులపాలెం వాసులు కోరుతున్నారు.

సముద్ర జీవుల మృత్యుఘోష

అధిక సంఖ్యలో తాబేళ్లు, డాల్ఫిన్ల మృత్యువాత

తీరానికి కొట్టుకువస్తున్న కళేబరాలు • సంరక్షణ చర్యలు తీసుకోవాలని విన్నపాలు

తీరంలో సాగరజీవుల మృత్యుఘోష కలవరపెడుతోంది. భీమిలి, ఉప్పాడ, మంగమారిపేట, రుషికొండ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం తీరాల వద్దకు నిత్యం ఏదో ఒక సముద్ర జీవి కళేబరం కొట్టుకుని రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల మంగమారిపేట తీరం వద్ద అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు అధిక సంఖ్యలో కొట్టుకురావడం కలకలం సృష్టిస్తోంది.



కొమ్మాది: సముద్రం అనేక జీవుల నివాసం. తాబేళ్ల నుంచి డాల్ఫిన్ల వరకు ఎన్నో జలచరాలు ఆవాసంగా చేసుకుని జీవిస్తుంటాయి. అయితే, ఇటీవల అవి అధిక సంఖ్యలో మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది. తీరానికి నిత్యం కొట్టుకువస్తున్న కళేబరాలు కలవరపెడుతున్నాయి.

వలకు చిక్కుకుని తాబేళ్లు..

ఆలివ్ రిడ్లే తాబేళ్లు అరుదైన జాతికి చెందినవి. 1980 నుంచి ఈ తాబేళ్లు విశాఖ బీచ్‌లో ఎక్కువ శాతం కనిపిస్తున్నాయి. సముద్రంలో దాదాపు 80 నాటికల్ మైళ్ల దూరం లోతులో ఇవి ఉంటాయని అంచనా. వీటి జీవనం అంతా సముద్రంలో అయినప్పటికి గుడ్లు పెట్టడానికి తీరానికి వస్తుంటాయి. వేల కిలోమీటర్ల వరకు వచ్చి గుడ్లు పెడుతుంటాయి. నేడు అటువంటి అరుదైన తాబేళ్లు తీరంలో మృత్యువాత పడుతున్నాయి. ఇవి వాస్తవానికి గుడ్లు పెట్టడానికి అనువైన స్థావరాలను ముందుగా ఎంపిక చేసుకుంటాయి. ఈ క్రమంలో సముద్రం నుంచి తీరానికి వచ్చే సందర్భాల్లో మత్స్యకారుల వలలకు చిక్కుకుని, శ్వాసలో ఇబ్బందులు గురై ఎక్కువ శాతం మరణించి, ఇలా తీరానికి కొట్టుకుని వస్తున్నాయని పరిశోధకులు తెలుపుతున్నారు. డిసెంబర్ నుంచి ఫిబ్రవరి వరకు తాబేళ్లు వలస వెళ్లే సమయం కావడంతో వందల సంఖ్యలో తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు తీరానికి వస్తుంటాయి. అందుకే ఈ సమయాల్లో తాబేళ్లు ఎక్కువగా మృత్యువాత పడుతుంటాయి.



పడవలను ఢీకొని డాల్ఫిన్లు..

తరచూ ఈ తీర ప్రాంతాల్లో డాల్ఫిన్లు, ముళ్లకప్పలు, సీ స్నేక్స్ వంటివి మృత్యువాత పడి, వాటి కళేబరాలు తీరానికి కొట్టుకుని వస్తున్నాయి. డాల్ఫిన్లు ఎక్కువ శాతం మత్స్యకారుల వేట సమయంలో పడవలను ఢీకొట్టి, వలలకు చిక్కుకుని, గాయాలపాలై మృత్యువాత పడి తీరానికి కొట్టుకు వస్తుంటాయి.

కారణాలనేకం

“సముద్ర జీవుల మరణానికి అనేక కారణాలు ఉన్నాయని చెప్పవచ్చు. ఎక్కువగా తాబేళ్లు, డాల్ఫిన్లు మత్స్యకారుల వలలకు చిక్కుకుని శ్వాస అందక మృత్యువాత పడి తీరానికి కొట్టుకుని వస్తున్నాయి. వాతావరణం మార్పులు కూడా కారణం కావచ్చు. అయితే ఇటీవల సముద్ర జీవులు మరణాలు ఎక్కువ అవుతున్నాయి.”

-డి.ఇ.బాబు, జువాలజీ రిటైర్డ్ ప్రొఫెసర్, ఏయూ





తీరానికి కొట్టుకుని వచ్చిన సీస్నేక్



సాగర్‌నగర్ బీచ్‌కు కొట్టుకుని వచ్చిన సముద్రపు కప్ప

కాలుష్యకాసారంగా సముద్రం

సముద్రంలో వాతావరణ మార్పులు, కాలుష్యం ఇతరత్రా అంశాలు వీటి మరణానికి కారణం అవుతున్నాయి. ముఖ్యంగా ఈ సముద్ర జీవులన్నీ ఎక్కువ శాతం నెట్ ట్రాప్‌నకు గురై మృత్యువాత పడుతున్నట్లు ఓ పరిశోధనలో తెలిసింది. ఇదిలా ఉండగా ఈ జీవులన్నీ పలు రొయ్యి పిల్ల కేంద్రాలు విడుదల చేస్తున్న రసాయనాల వలన మృత్యువాత పడుతున్నాయని ఇక్కడ మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. కారణాలు ఏమైనా ఏటా కొన్ని వందల సముద్ర జీవులు మృత్యువాత పడటం బాధాకరమైన విషయం. సంబంధిత అధికారులు వీటి మరణాలపై మరింత అధ్యయనం చేసి, సముద్ర జీవుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



కాలుష్యంతో నురగలు కక్కుతున్న మంగమారిపేట బీచ్

సకాలంలో దరఖాస్తులు పరిష్కరించకుంటే చర్యలు

- నిర్లక్ష్యం చేసిన వారికి మెమోలు సిద్ధం
- జోన్-2 రెవెన్యూ విభాగం సమీక్ష సమావేశంలో డీసీఆర్



సమావేశానికి హాజరైన ఆర్ఐలు, అడ్మిన్ సెక్రటరీలు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీఆర్ శ్రీనివాసరావు

మధురవాడ: జీవీఎంసీ రెవెన్యూ విభాగానికి వచ్చిన దరఖాస్తులను 15 రోజుల్లో పరిష్కరించాలని జీవీఎంసీ రెవెన్యూ డిప్యూటీ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశించారు. ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పీఎం పాలెం అవంతి ఫంక్షన్ హాల్లో ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ ఫణిరాం అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ విభాగం సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వీఎల్‌టీ, ఇంటి పన్ను తదితరాలకు సంబంధించి దరఖాస్తులు వస్తున్నా, సకాలంలో పరిష్కరించడం లేదని ఫిర్యాదులు అందాయన్నారు. అలా నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. అలాంటి వారిని ఇప్పటికే కొందరిని గుర్తించామని, వారికి మెమోలు జారీ చేస్తున్నామని తెలిపారు. మూడు రోజుల్లో వీఎల్‌టీలు, ఇతర అసెస్‌మెంట్‌ల గుర్తింపు జరగాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌వో శివకుమార్, ఆర్ఐలు పాల్గొన్నారు.

పోలీస్ బెటాలియన్‌లో మినీ క్రిస్మస్ వేడుకలు



వేడుకల్లో పాల్గొన్న అధికారులు సిబ్బంది

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరోవార్డులోని ఏపీఎస్‌పీ పోలీస్ బెటాలియన్‌లో బుధవారం సాయంత్రం మినీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కేవీ మురళీకృష్ణ మాట్లాడుతూ శాంతి దూత క్రీస్తు ప్రబోధాలను సర్వ మానవాళి అనుసరించాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది కొవ్వొత్తులు వెలిగించారు. క్రీస్తు శాంతి ప్రబోధ గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో పాస్టర్ సతీష్‌పాల్, బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు, అసిస్టెంట్ కమాండెట్లు పి.సత్యం, జి.ఎలియసాగర్, వి.నారాయణరావు, ఆర్ఐలు ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తీరం.. తళతళ



పరిశుభ్రంగా బీచ్

- గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన కొత్త వాహనం
- నిత్యం పరిశుభ్రంగా భీమిలి తీరప్రాంతం



బీచ్‌లోని చెత్తను తొలగిస్తున్న ట్రాక్టర్

భీమునిపట్నం: భీమిలి బీచ్‌లోని ఇసుక తళతళలాడుతూ సందర్శకులను ఆకట్టుకుంటోంది. గతంలో ఇక్కడ బీచ్‌లో చెత్తతో పాటు, ఇసుక కూడా నల్లగా ఉండడంతో పరిసరాలు అధ్వానంగా ఉండేవి. దీంతో సరదాగా బీచ్‌లో గడుపుదామని వచ్చినవారు, ఆ ఇసుకలో కూర్చునేందుకు వీలు కాక నిరాశగా వెనుతిరిగేవారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం బీచ్‌ల అభివృద్ధిలో భాగంగా ప్రత్యేక యంత్రంతో కూడిన ట్రాక్టర్‌ను మంజూరు చేసింది. ఆ వాహనం సహాయంతో ఇక్కడ బీచ్‌ను నిత్యం శుభ్రం చేస్తున్నారు. ట్రాక్టర్ వెనుకనున్న తొట్టెలాంటి యంత్రం ఇసుకమీదనున్న చెత్త చెదారాలతో పాటు రెండు అడుగుల లోతులో కూరుకుని ఉన్న చెత్తను ఏరివేస్తోంది. దీంతో బీచ్‌లో ఇసుక మెరుస్తూ, అందంగా దర్శనమిస్తోంది. దీంతో సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామాల్లో నయా మోసగాళ్లు

ఆఫర్ల పేరుతో మహిళలకు బురిడీ

తగరపువలస: భీమిలి చుట్టుపక్కల గ్రామాల్లో కొత్త తరహా మోసగాళ్లు ఆఫర్ల పేరుతో మహిళలను దగా చేస్తున్నారు. నాసిరకం వస్తువులను అంటగట్టి, పనిచేయని ఫోన్ నంబర్లు ఇచ్చి డబ్బులతో పరారవుతున్నారు. వివరాలివి.. ఇటీవల భీమిలి జోన్‌లోని చిల్లపేట, జీరుపేట గ్రామాలలో గుర్తు తెలియని మోసగాడు ఒకరు వచ్చి డ్వాక్రా మహిళల గురించి ఆరా తీసి, వారిని పరిచయం చేసుకున్నాడు. మూడు వారాలకు ఒకసారి డ్రెస్ మెటీరియల్ తెచ్చి ఇస్తానని వాటిని కుట్టి ఇస్తే డబ్బులు బాగా వస్తాయని నమ్మించాడు. అలాగే తమ సంస్థ వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు వాయిదాల పద్ధతిలో విక్రయిస్తోందని, ఒకేసారి డబ్బులు చెల్లిస్తే సగం ధరలకే ఇవ్వడంతో పాటు క్రిస్మస్‌కు గిఫ్టులు కూడా ఉంటాయని ఆశ చూపాడు. తన వ్యాపారానికి సంబంధించిన ఫ్లెక్సీలు మీ ఇంటి వద్ద పెడతానని అందుకు నెలకు రూ.1800 అద్దె చెల్లిస్తానని నమ్మ బలికాడు. దీంతో కొందరు మహిళలు రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి విలువైన వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు కొనుగోలు చేశారు. గిఫ్టులు తీసుకువస్తానని వారికి చెప్పి తన ఫోన్ నంబర్ ఇచ్చాడు. సందేహం వచ్చిన బాధిత మహిళలు వెంటనే ఫోన్ చేయగా పనిచేయలేదు. దీంతో వారు ఆ మోసగాడిని నిలదీయగా జారుకున్నాడు. తాము కొనుగోలు చేసి వన్ గ్రామ్ గోల్డ్ బంగారు ఆభరణాలు మార్కెట్‌లో మూడో వంతు ధరలకే లభిస్తుండటంతో మోసపోయామంటూ బాధిత మహిళలు వాపోతున్నారు. ఇదే తరహాలో మోసగాళ్లు భీమిలి సరిహద్దులోని భోగాపురం మండలంలో కూడా పలు గ్రామాలలో మహిళలను మోసం చేసినట్టు తెలిసి వారంతా ఓదార్చుకుంటున్నారు. మోసపోవద్దంటూ తెలిసిన వారికి జాగ్రత్తలు చెబుతున్నారు.

పన్నులు చెల్లిస్తాం.. సెటిల్‌మెంట్ చేయండి

రెవెన్యూ సదస్సులో బోని పంచాయతీ రైతుల విన్నపం



తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్‌కు రైతుల సమస్యలు వివరిస్తున్న మాజీ సర్పంచ్ సూర్యనారాయణ

తగరపువలస: తాము సాగు చేసుకుంటున్న భూములకు గతంలో పన్నులు చెల్లించేవారమని, రిజిస్ట్రేషన్లు కూడా జరిగేవని ఆనందపురం మండలం బోని పంచాయతీ రైతులు తెలిపారు. అవసరమైతే ఇప్పుడు కూడా పన్నులు చెల్లిస్తాం, సెటిల్‌మెంట్‌కు రావాలని తమ వాణిని రెవెన్యూ సదస్సులో వినిపించారు. భీమిలి ఆర్డీవో సంగీత్ మాథూర్, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్ సమక్షంలో బుధవారం నిర్వహించిన సదస్సులో రైతులు మాట్లాడారు. ఎకరాకు రూ.18 వంతున పన్నులు మాత్రమే చెల్లించామని, ఇప్పుడు మాన్సాస్ ప్రతినిధులు ఎకరాకు రూ.5వేలు శిస్తు చెల్లించాలని వేధిస్తున్నట్లు ఆరోపించారు. బోని గ్రామం మాన్సాస్ ట్రస్ట్ పరిధిలో లేదన్నారు. సుమారు 620 ఎకరాలలో రైతులు వందేళ్ల పైబడి సాగు చేసుకుంటున్నారన్నారు. గిల్‌మన్ రికార్డులలోనూ తమ పేర్లు నమోదై ఉన్నాయన్నారు. ఇనాం భూములని, మాన్సాస్ భూములని అనధికార ప్రకటనలతో రైతులను అయోమయానికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తాము పన్నులు కూడా చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత శిస్తు చెల్లించాలని అడగడం బాగా లేదన్నారు. తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు జారీ చేస్తే ప్రయోజనం చేకూరుతుందన్నారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు తమగోడు వెళ్లబోసుకుందామని వస్తే ఆయన రాలేదని వాపోయారు. సదస్సులో బోని అప్పలనాయుడు, బోని సన్యాసినాయుడు, సురాల సత్య వరప్రసాద్, బోని ముకుంద తదితరులు పాల్గొన్నారు.

సంగివలసలో..

జీవీఎంసీ భీమిలి జోన్ సంగివలసలో జరిగిన రెవెన్యూ సదస్సులో భీమిలి తహసీల్దార్ పైల రామారావు అర్జీలు స్వీకరించారు.

బుడ్డివలస అగ్రహారంలో 23 దరఖాస్తులు

పద్మనాభం: మండలంలోని బుడ్డివలస అగ్రహారంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 23 మంది దరఖాస్తులు అందజేశారు. మ్యుటేషన్‌కు ముగ్గురు, కులం సర్టిఫికెట్లకు 15మంది , 22ఏ కు ఒకరు, సబ్ డివిజన్ కోసం నలుగురు దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ కె.ఆనందరావు ఈ దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో హెచ్‌డీటీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ



శిక్షణకు హాజరైన మండల సచివాలయ సిబ్బంది

తగరపువలస: ‘స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ’ అనే అంశంపై ఆనందపురం మండలంలోని సచివాలయాల సిబ్బందికి రెండు రోజుల పాటు జరిగే శిక్షణ మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కోర్సు డైరెక్టర్ ఎంపీడీవో డాక్టర్ వి.జానకి తెలిపారు. అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్‌గా పంచాయతీ విస్తరణ అధికారి బి.సత్యనారాయణ వ్యవహరిస్తున్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ నుంచి నాగరాజు పరిశీలకునిగా పాల్గొన్నారు.

నిబంధనలు తూచ్

- కొమ్మాదిలో టీడీపీ నాయకుడి అక్రమ నిర్మాణం
- చూసీచూడనట్లున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు
- జీవీఎంసీ ఆదాయానికి గండి



కొమ్మాది రోడ్డులో టీడీపీ నాయకుడి అక్రమ నిర్మాణం

మధురవాడ: కొమ్మాది డబుల్ రోడ్డులో ఓ చికెన్ షాపు పక్కన 5వ వార్డు టీడీపీ నాయకుడు సుమారు 300గజాల విస్తీర్ణంతో 3 భారీ షాపులు నిర్మిస్తున్నాడు. దీనికి వీఎల్‌టీ లక్షల్లో కట్టాలి. ప్లాన్‌కు మరో లక్ష రూపాయల వరకు కట్టాల్సి ఉంటుంది. అయినా ఏమీ లేవు. ప్రభుత్వ ఆదాయానికి భారీ స్థాయిలో గండి కొట్టేస్తున్నారు. పనులు మాత్రం ఎక్స్‌ప్రెస్ వేగంతో నడిచిపోతున్నాయి. మాస్టర్ ప్లాన్ రోడ్డులో బహిరంగంగా నిర్మాణం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై స్థానికులు బుధవారం ఫిర్యాదు ఇవడంతో ప్లానింగ్ సెక్రటరీ కొంతమందితో వచ్చి కిటికీ కోసం సందు కొట్టినంత కొడుతుండగా, సదరు టీడీపీ నాయకులు రావడంతో తిరిగి వెళ్లిపోయారు. భారీస్థాయిలో నగదు చేతులు మారుతోందని, ఉన్నత స్థాయి అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై టీపీవో బాలరాజును వివరణ కోరగా ప్లాన్ తెచ్చుకున్నంత వరకు నిర్మాణ పనులు నిలుపుదల చేస్తామన్నారు.

విద్యతో బాలికల్లో నిర్ణయాత్మక శక్తి



బాలికావిద్య ప్రాముఖ్యత గురించి తెలియజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీవాణి

తగరపువలస: బాలికలు చదువుకుంటే వారి జీవిత గమనాన్ని, భవిష్యత్తును నిర్ణయించుకునే శక్తిగా ఎదుగుతారని చిట్టివలస ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి అన్నారు. నయీ చేతన-3.0 కార్యక్రమంలో భాగంగా బాలికావిద్యపై కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చదువుతో ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులు నీహారిక, స్రవంతి ప్రదర్శించిన నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. బాలికా విద్య ప్రాముఖ్యత గురించి తీర్చిదిద్దిన రంగవల్లిక ఆలోచింపచేసింది. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న హస్తకళల మేళా



మేళాలో శంభువానిపాలెం వనసంరక్షణ ఉత్పత్తుల విక్రయ స్టాల్

పీఎం పాలెం: శిల్పారామం (జాతర)లో ఈ నెల 13వ తేదీన ప్రారంభమైన హస్తకళల మేళా ఆకట్టుకుంటోంది. చేనేత వస్త్ర ఉత్పత్తులు, కొండపల్లి, ఏటికొప్పాక చెక్క బొమ్మలతో పాటు లెదర్‌తో తయారు చేసిన వస్తువుల స్టాల్స్‌కు ఆదరణ లభిస్తోంది. ఆరో వార్డులోని శంభువానిపాలెం వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ స్టాల్లో అటవీ ఉత్పత్తులైన వెదురుతో తయారు చేసిన కొలత పరికరాలు ఆకట్టుకుంటున్నాయి. అలాగే వెంకటగిరి, మంగళగిరి చీరలు, మచిలీపట్నం, నారాయణ్ పేట, ఉప్పాడ, ధర్మవరం, పోచంపల్లి, గద్వాల చీరలు, బెడ్ షీట్లు, పొందూరు ఖాదీ, లెదర్‌తో తయారుచేసిన గృహోపకరణాలు, జ్యూయలరీ స్టాల్స్‌లో లభిస్తున్నాయి. మార్కెట్ రేటు కంటే తక్కువ ధరకే ఈ స్టాల్స్‌లో విక్రయిస్తున్నారు. ఈ నెల 26వ తేదీ వరకూ మేళా ఉంటుందని స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి తెలిపారు.

ఉపకరణాల కోసం దివ్యాంగుల ఎంపిక నేడు

పద్మనాభం: దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల కోసం మండలంలోని రెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నియోజక వర్గ స్థాయిలో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు ఎంపీడీవో ఎం.విజయ్ కుమార్ తెలిపారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి భీమునిపట్నం నియోజకవర్గంలోని దివ్యాంగులు హాజరు కావాలని కోరారు.

వర్షంతో చిత్తడిగా రహదారులు



రేవళ్లపాలెం రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీరు

మధురవాడ/పీఎం పాలెం: అల్పపీడన ప్రభావంతో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం వరకు మధురవాడలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. చలిగాలులతో వృద్ధులు వణికిపోతున్నారు. వర్షాలకు లోతట్టు ప్రాంతాలైన రేవళ్లపాలెం రోడ్డు, గాయత్రి కళాశాలకు వెళ్లే రోడ్డు, చంద్రంపాలెం సర్వీసు రహదారుల్లో వర్షం, మురుగు నీరు ఏకమై స్థానికులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఆర్‌హెచ్ కాలనీ, గాయత్రి నగర్, బాబా నగర్, ముస్లిం కాలనీల్లోని రహదారులు చిత్తడిగా మారాయి.